

దుబ్బాక నియోజకవర్గం దౌల్తాబాద్ మండలంలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి (ఫైల్)



హుస్నాబాద్‌లో ప్రజాఆశీర్వాద సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్ (ఫైల్)





గజ్వేల్ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి (ఫైల్)

# గులాబీ దూకుడు

## జోరుగా సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభలు



- హుస్నాబాద్, సిద్దిపేట, నారాయణఖేడ్‌లో ఇప్పటికే సభలు పూర్తి
- 9న గజ్వేల్‌లో బహిరంగ సభ
- ఈనెల 15న నుంచి రెండో విడత ముఖ్యమంత్రి కేసీఆర్ సభలు
- బీఆర్‌ఎస్ అభ్యర్థుల విజయానికి ఉమ్మడి మెదక్ జిల్లాను చుట్టేస్తున్న మంత్రి హరీశ్‌రావు
- ఎప్పటికప్పడు పార్టీ నేతలకు దిశానిర్దేశం
- జోరుగా అభ్యర్థుల ఇంటింటి ప్రచారం
- క్యాడర్‌లో రెట్టించిన ఉత్సాహం
- కండ్ల ముందు కనిపిస్తున్న అభివృద్ధి
- ఇంటింటికీ సంక్షేమ పథకాలతో ప్రజల్లో ఆదరణ
- బీఆర్‌ఎస్‌కు మద్దతుగా ఏకగ్రీవ తీర్మానాలు
- పత్తాలేని ప్రతిపక్షాలు... క్యాడర్‌లో అయోమయం

సిద్దిపేట, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): శాసనసభ ఎన్నికల ప్రచారంలో బీఆర్‌ఎస్ మంచి దూకుడు మీద ఉన్నది. అన్ని పార్టీలకన్నా ముందే అభ్యర్థులను ప్రకటించడంతో పాటు ప్రచారంలోనూ తనదైన శైలిలో ముందు వరుసలో ఉంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ''ప్రజాఆశ్వీరాద సభలు'' గ్రాండ్ సక్సెస్ అయ్యాయి. సీఎం కేసీఆర్ ప్రసంగాలను ఓపిగ్గా విన్న ప్రజలు గ్రామాల్లో బీఆర్‌ఎస్ చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చర్చకు పెడుతున్నారు. ఇంత మంచిగా చేసిన ప్రభుత్వానికే తమ మద్దతు అంటూ ఆయా గ్రామాలు ఏకగ్రీవ తీర్మానాలు సైతం చేస్తున్నాయి. సిద్దిపేట జిల్లాలో గత నెల 15న హుస్నాబాద్‌తో సీఎం కేసీఆర్ ప్రజాఆశ్వీరాద సభలకు శ్రీకారం చుట్టి రాష్ట్రంలో అనేక సభల్లో పాల్గొంటున్నారు. 17న సిద్దిపేట, 30న నారాయణఖేడ్‌లో నిర్వహించిన ప్రజాఆశీర్వాద సభల్లో పాల్గొన్నారు. ఈనెలలో జిల్లాలోని అన్ని నియోజకవర్గాలు కవరయ్యేలా ప్రజాఆశీర్వాద సభల నిర్వహణకు పార్టీ ప్రణాళిక సిద్ధం చేసింది. అన్ని సభల్లో సీఎం కేసీఆర్ పాల్గొననున్నారు. మెదక్ జిల్లా కేంద్రంలో ఈనెల 15న మెదక్ నియోజకవర్గ ఆశీర్వాద సభ జరగనుండగా, ఈనెల16న నర్సాపూర్ నియోజకవర్గ కేంద్రంలో ప్రజాఆశీర్వాద సభలు నిర్వహించేలా బీఆర్‌ఎస్ పార్టీ ప్రణాళికలు సిద్ధం చేసింది. 18న సిద్దిపేట జిల్లాలోని జనగామ నియోజకవర్గం పరిధిలోని చేర్యాల పట్టణం, 26న దుబ్బాక నియోజకవర్గ కేంద్రం, 28న సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్‌లో ప్రజాఆశీర్వాద సభ నిర్వహిస్తారు. సంగారెడ్డి జిల్లాలో ఈనెల 23న జహీరాబాద్, పటాన్‌చెరు నియోజకవర్గ కేంద్రాల్లో, 27న ఆందోల్, సంగారెడ్డి నియోజకవర్గ కేంద్రాల్లో ప్రజాఆశీర్వాద సభలు జరగనున్నాయి. ఈనెల 20న కరీంనగర్ జిల్లా మానకొండూరులో ప్రజాఆశీర్వాద సభ జరగనున్నది. ఆదిశగా సభలు నిర్వహించి బీఆర్‌ఎస్ తనసత్తా మరోసారి చాటి ఉమ్మడి మెదక్ జిల్లా బీఆర్‌ఎస్ పార్టీకి కంచుకోట అని చాటి చెప్పనున్నారు. రాష్ట్రానికి ఈశాన్య ప్రాంతంలో ఉన్న సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నుంచి ప్రజాఆశీర్వాద సభలకు సీఎం కేసీఆర్ శ్రీకారం చుట్టి గజ్వేల్ సభతో ప్రజాఆశీర్వాద సభలను పూర్తి చేస్తారు. శనివారం సీఎం కేసీఆర్ నంగునూరు మండలం కోనాయిపల్లి వేంకటేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తన నామినేషన్ పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ ప్రజల వద్దకు వెళ్లి ఆప్యాయంగా పలకరించడంతో ప్రజల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. అంత పెద్ద వ్యక్తి మా వద్దకు వచ్చి మమ్ముల్ని ఆప్యాయంగా పలకరించాడని కోనాయిపల్లి గ్రామస్తులు తమ సంతోషం వ్యక్తం చేశారు.



ఆదివారం సంగారెడ్డి మండలంలో ప్రచారం నిర్వహిస్తున్న సంగారెడ్డి నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్



ఆదివారం నర్సాపూర్ నియోజకవర్గంలో ప్రచారం నిర్వహిస్తున్న సునీతాలక్ష్మారెడ్డి



ఆదివారం మునిపల్లి మండలం చిన్నచెల్మెడ ప్రచారంలో ఎమ్మెల్యే క్రాంతికిరణ్

### ఉమ్మడి జిల్లాను చుట్టేస్తున్న మంత్రి హరీశ్‌రావు

సీఎం కేసీఆర్ అప్పగించిన పార్టీ బాధ్యతలను ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు పక్కాగా అమలు చేస్తూనే.. ఉమ్మడి మెదక్ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి విశేషంగా కృషి చేస్తున్నారు. ప్రతిపక్ష పార్టీల ఎత్తులను చిత్తు చేస్తూనే పార్టీని మరింత బలపరుస్తూ అభ్యర్థుల విజయానికి కష్టపడుతున్నారు. ఉదయం, పగలు, రాత్రి అనే తేడా లేకుండా తిరుగుతూనే ఉన్నారు. హ్యాట్రిక్ సీఎం కేసీఆర్‌ను చేయాలనే సంకల్పంతో మంత్రి కష్టపడుతున్నారు. ఈ తొమ్మిదేండ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను లెక్కలతో వివరిస్తూ ప్రతిపక్ష పార్టీలను ఓ పక్క చెడుగుడు ఆడుకుంటున్నారు. పక్క రాష్ట్రం అయిన కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ ఏం చేసింది...? బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఆపార్టీ ఏం చేసింది..? అనే విషయాలను ప్రజలకు అర్థమయ్యేలా విడమరిచి చెబుతున్నారు. ఒక వైపు తాను ప్రాతినిధ్యం వహిస్తున్న సిద్దిపేట నియోజకవర్గంతో పాటు సీఎం కేసీఆర్ పోటీ చేస్తున్న గజ్వేల్ నియోజకవర్గాన్ని చూసుకుంటున్నారు. ఇటీవల కత్తిపోట్ల దాడిలో తీవ్రగాయాల పాలైన దుబ్బాక అభ్యర్థి, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి దవాఖానలో చికిత్స పొందుతున్నారు. దీంతో ఈ నియోజకవర్గ పూర్తి బాధ్యతలు మంత్రిపైనే పడ్డాయి. సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, నియోజకవర్గాలను చూసుకుంటూనే ఉమ్మడి మెదక్ జిల్లాలో పార్టీ అభ్యర్థులను గెలిపించుకొని ఉమ్మడి జిల్లాలో బీఆర్‌ఎస్ పార్టీ క్లీన్ స్వీప్ చేసి మొత్తం 11 స్థానాల అభ్యర్థులను సీఎం కేసీఆర్‌కు కానుక ఇచ్చేలా మంత్రి హరీశ్‌రావు కష్టపడి పనిచేస్తున్నారు.

### సీఎం కేసీఆర్ సభలతో జోష్... జోరుగా అభ్యర్థుల ప్రచారాలు

సీఎం కేసీఆర్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉమ్మడి మెదక్ జిల్లాలో నిర్వహించిన బీఆర్‌ఎస్ సభలతో మంచి జోష్ వచ్చింది. గత నెల 15న హుస్నాబాద్, 17న సిద్దిపేట, 30న నారాయణ్‌ఖేడ్‌లో నిర్వహించిన సభలకు భారీ ఎత్తున ప్రజలు తరలివచ్చారు. దీంతో బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలు మంచి రెట్టించిన ఉత్సాహంతో ప్రచారంలో దూసుకుపోతున్నారు. సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గంలో లక్ష ఓట్ల మెజార్టీతో సీఎం కేసీఆర్‌ను గెలిపించుకుంటామని చెప్పి పార్టీ క్యాడర్ గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. సిద్దిపేటలో ఆర్థిక, వైద్యారోగ్యశాఖల మంత్రి హరీశ్‌రావుకు మద్దతుగా స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రతి వంద ఓట్లకు ఒకరు చొప్పున ఇక్కడ ఇన్‌చార్జిలు పనిచేస్తున్నారు. గజ్వేల్, సిద్దిపేటలో గ్రామాలకు గ్రామాలు బీఆర్‌ఎస్ పార్టీకి మద్దతు తెలుపుతూ ఏకగ్రీవ తీర్మానాలు చేస్తున్నాయి. దుబ్బాక నియోజకవర్గంలో మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డికి మద్దతుగా పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, సమన్వయ కమిటీలు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఇక్కడ ఒక్కొక్కరు ఒక కేపీఆర్ అనుకొని ప్రచారం చేస్తూ ప్రతి పక్షాలు చేస్తున్న హత్యారాజకీయాలను ప్రజలకు వివరిస్తున్నారు. హుస్నాబాద్‌లో అభ్యర్థి ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ ఇప్పటికే మెజార్టీ గ్రామాల్లో తన ప్రచారాన్ని పూర్తిచేశారు. అక్కడి క్యాడర్ ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. జనగామ నియోజకవర్గం పరిధిలోని గ్రామాల్లో అక్కడి అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మానకొండూరు అభ్యర్థి బాలకిషన్ తమ తమ గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు. మెదక్ నియోజకవర్గంలో మెదక్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి ప్రచారంలో తనదైన శైలిలో ముందుకు వెళ్తున్నారు. వినూత్న ప్రచారం నిర్వహిస్తున్నారు. నర్సాపూర్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి స్థానిక ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో కలిసి గ్రామాలను చుట్టేస్తున్నారు. అందోల్ అభ్యర్థి చంటి క్రాంతి కిరణ్ తనదైన శైలిలో ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. ప్రతిపక్ష పార్టీల ఎత్తుగడలను ఎప్పటికప్పడు కనిపెట్టుకుంటూనే వాటికి దీటుగా ప్రచారంలో దూసుకుపోతున్నారు. నారాయణఖేడ్‌లో అభ్యర్థి ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ప్రచారంలో భాగంగా తండాలు, గ్రామాలను చుట్టేస్తున్నారు. సీఎం కేసీఆర్ సభతో ఇక్కడ పార్టీ క్యాడర్ మరింత ఉత్సాహంగా పనిచేస్తున్నది. భారీ మెజార్టీయే లక్ష్యంగా పనిచేస్తున్నారు. జహీరాబాద్‌లో అభ్యర్థి మాణిక్‌రావు తన ఎన్నికల ప్రచారాన్ని ఉధృతం చేశారు. సంగారెడ్డి అభ్యర్థి చింతా ప్రభాకర్ తనదైన శైలిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. గత ఎన్నికల్లో గెలిచిన జగ్గారెడ్డి ఏం చేయలేదు కదా.. కనీసం ప్రజలకు అందుబాటులో లేరు అన్న విషయాన్ని గట్టిగా ప్రజలకు వివరిస్తున్నారు. సీఎం కేసీఆర్ మంత్రి హరీశ్‌రావు సహకారంతో ప్రజల మధ్యనే ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశాను ఆశీర్వదించండి అని ప్రజలను చింతా ప్రభాకర్ కోరుతున్నారు. ప్రజల నుంచి మంచి స్పందన వస్తుంది. పటాన్‌చెరులో అభ్యర్థి, ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ఎన్నికల ప్రచారం జోరుగా కొనసాగుతున్నది. నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని వివరిస్తూ ఈ ఎన్నికల్లో గెలిపించాలని ప్రజలను కోరుతున్నారు. ఆయా ఆయా నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల ముందు చర్చ పెట్టి బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరుతున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే జరిగే నష్టాన్ని వివరిస్తూ.. పక్కనే ఉన్న కర్ణాటక రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలను వివరిస్తూ కాంగ్రెస్ లోపాలను ఎండగడుతున్నారు.



ఆదివారం పటాన్‌చెరులో ప్రచారం నిర్వహిస్తున్న గూడెం మహిపాల్‌రెడ్డి




ఆదివారం మద్రి గ్రామంలో మాట్లాడుతున్న జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు



ఆదివారం హవేళీఘనపూర్ మండలం ముత్తాయికోటలో ప్రచారం నిర్వహిస్తున్న పద్మాదేవేందర్ రెడ్డి






గజ్వేల్ పట్టణ వ్యూ

# గజ్వేల్‌లో గెలిచిన పార్టీదే.. రాష్ట్రంలో అధికారం

## రాజకీయ చైతన్యం కలిగిన నియోజకవర్గం గజ్వేల్

- రాష్ట్రంలోనే ప్రత్యేక స్థానం.. సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యంతో దేశవ్యాప్తంగా గుర్తింపు
- తొమ్మిదేండ్లలో గణనీయంగా ప్రగతి
- ఇక్కడ ఏపార్టీ గెలిస్తే రాష్ట్రంలో అదే పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి
- నామమాత్రంగానే బీజేపీ,కాంగ్రెస్
- వరుసగా మూడోసారి పోటీచేస్తున్న కేసీఆర్

సిద్దిపేట, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం రాజకీయ చైతన్యం కలిగిన ప్రాంతం. ఈ నియోజకవర్గానికి రాష్ట్రంలోనే ప్రత్యేక స్థానం కలిగి ఉంది. బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ఇక్కడి నుంచి వరుసగా మూడోసారి అసెంబ్లీకి పోటీచేస్తున్నారు. దీంతో యావత్తు దేశం ఇటు వైపు చేస్తున్నది. ఈ నియోజకవర్గం నుండి గెలుపొందిన పార్టీనే రాష్ట్రంలో అధికారంలోకి వస్తున్నది. నాటి నుంచి ఇదే ఇక్కడ జరుగుతున్నది. ఈ నియోజకవర్గ ప్రజలు అభివృద్ధికి పట్టం కడుతున్నారు. బీఆర్‌ఎస్‌కు అన్ని గ్రామాల్లో బలమైన క్యాడర్ ఉంది. ఈ తొమ్మిదేండ్లలో సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి పనులు కండ్ల ముందు కనిపిస్తున్నాయి. ఇప్పటికే గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను గడప గడపకూ తీసుకుపోతున్నారు. విస్తృత ప్రచారం చేస్తున్నారు. రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో సీఎం కేసీఆర్‌ను గెలిపించుకునేందుకు ఇక్కడి ప్రజలు సిద్ధమయ్యారు. 2014,2018 సాధారణ ఎన్నికల్లో పోటీ చేసిన కేసీఆర్ మంచి మెజార్టీతో విజయం సాధించారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి గజ్వేల్ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి దేశానికే తలమానికంగా నిలిపారు. రవాణా, వైద్యం, తాగునీరు, విద్య, విద్యుత్, ఔటర్ రింగురోడ్డు, డబుల్ బెడ్‌రూం ఇండ్లు, ఆదర్శ గ్రామాలు, ఉద్యాన, ఫారెస్ట్ యూనివర్సిటీలు, ఎడ్యుకేషనల్ హబ్, ఇలా చెప్పుకుంటూ పోతుంటే ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయి. కొండపోచమ్మ, మల్లన్నసాగర్ రిజర్వాయర్ల ద్వారా సాగునీటి కష్టాలు తీరాయి. భూమికి బరువయ్యేలా పంటలు పండుతున్నాయి. హల్దీవాగు, కూడవెల్లి వాగుల జీవనదిలా మారాయి. గజ్వేల్ ప్రాంతానికి రైలు సైతం వచ్చింది.దీంతో ప్రజల్లో సంతోషం వెల్లివిరిస్తున్నది. ఈ ఎన్నికల్లో మూడోసారి సీఎం కేసీఆర్ గజ్వేల్ నుంచి పోటీచేస్తున్నారు. ఇక్కడ బీజేపీ, కాంగ్రెస్ నామమాత్రంగానే ఉన్నాయని చెప్పాలి.



### గజ్వేల్ రాజకీయ ముఖచిత్రం...

గజ్వేల్ నియోజకవర్గం 1952లో ఆవిర్భవించింది. రాజకీయ చైతన్యం కలిగిన నియోజకవర్గంగా మంచిపేరు ఉంది. ఈ నియోజకవర్గంలో గజ్వేల్ పట్టణంతో పాటుగా గజ్వేల్, ములుగు, తూప్రాన్, వర్గల్, జగదేవ్‌పూర్, కొండపాక, మండలాలు ఉండగా.. జిల్లాల పునర్విభజనలో భాగంగా కొత్తగా ఏర్పాటైన మనోహరాబాద్, మర్కూక్ మండలాలతో పాటు గతేడాది కుకునూరుపల్లి మండలం ఏర్పాటైంది. ఇవన్నీ ఈ నియోజకవర్గం పరిధిలోకి వస్తాయి. గజ్వేల్ నియోజకవర్గం 1957 నుంచి 2004 వరకు ఎస్సీ రిజర్వుడుగా ఉంది. 7 పర్యాయాలు కాంగ్రెస్ పార్టీ గెలువగా.. 3 సార్లు టీడీపీ అభ్యర్థి, 2 సార్లు స్వతంత్ర అభ్యర్థులు, రెండుసార్లు టీఆర్‌ఎస్ గెలుపొందింది. 1957లో (ఎస్సీ రిజర్వుడు) జేబీ ముత్యాల్‌రావు (కాంగ్రెస్), 1962లో (ఎస్సీ రిజర్వుడు) గజ్వేల్ సైదయ్య (స్వతంత్ర), 1967లో (ఎస్సీ రిజర్వ్‌డ్) గజ్వేల్ సైదయ్య (కాంగ్రెస్), 1972లో (ఎస్సీ రిజర్వుడు) గజ్వేల్ సైదయ్య (కాంగ్రెస్), 1978లో గజ్వేల్ సైదయ్య (కాంగ్రెస్), 1983లో (ఎస్సీ రిజర్వుడు) అల్లం సాయిలు (స్వతంత్ర), 1985లో (ఎస్సీ రిజర్వుడు) సంజీవరావు (టీడీపీ), 1989లో (ఎస్సీ రిజర్వుడు) జె.గీతారెడ్డి (కాంగ్రెస్), 1994లో (ఎస్సీ రిజర్వుడు) విజయరామారావు (టీడీపీ), 1999లో (ఎస్సీ రిజర్వుడు) సంజీవరావు (టీడీపీ), 2004లో (ఎస్సీ రిజర్వుడ్) గీతారెడ్డి (కాంగ్రెస్) ఎమ్మెల్యేలుగా ప్రాతినిధ్యం వహించారు. 2009 ఎన్నికల్లో జనరల్ స్థానంలో తూంకుంట నర్సారెడ్డి (కాంగ్రెస్) ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు. 2014లో జనరల్ స్థానంలో జరిగిన ఎన్నికల్లో టీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ పోటీచేసి 20వేల ఓట్ల అధిక్యంతో గెలుపొందారు. అనంతరం రాష్ట్రంలో టీఆర్‌ఎస్ అధికారంలోకి రావడంతో కేసీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 2018 ఎన్నికల్లో రెండోసారి కేసీఆర్ 58,290 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. తిరిగి రెండోసారి రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. గజ్వేల్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపారు.

### గజ్వేల్ నుంచి మూడోసారి బరిలో సీఎం కేసీఆర్...

సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం నుంచి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు వరుసగా మూడోసారి బరిలోకి దిగుతున్నారు. ఇక్కడ హ్యాట్రిక్ కొట్టేందుకు పావులు కదుపుతున్నారు. 2014 ఎన్నికల్లో 19,391 ఓట్ల మెజార్టీతో టీడీపీ అభ్యర్థిపై విజయం సాధించారు. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిపై 58,290 ఓట్ల మెజార్టీతో భారీ విజయాన్ని సొంతం చేసుకున్నారు. సీఎం కేసీఆర్ రాజకీయ ప్రస్థానం చూస్తే మొదట 1983లో టీడీపీ తరఫున సిద్దిపేట నుంచి పోటీచేసి తన రాజకీయ గురువైన మదన్‌మోహన్ చేతిలో కేవలం 879 ఓట్ల స్వల్ప తేడాతో ఓడిపోయారు. అనంతరం మధ్యంతర ఎన్నికల్లో 1985లో సిద్దిపేట నుంచి కాంగ్రెస్ అభ్యర్థి మహేందర్‌రెడ్డిపై తొలిసారి విజయం సాధించారు. అప్పటి నుంచి సిద్దిపేటను తన కంచుకోటగా మలుచుకున్నారు. 1985లో టీడీపీ తరఫున 16,156 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఇలా వరుస ఎన్నికల్లో 1989లో 13,816 ఓట్ల మెజార్టీ, 1994లో 27,107 ఓట్ల మెజార్టీ, 1999లో 27,555 ఓట్ల మెజార్టీతో కేసీఆర్ వరుసగా గెలుపొందారు. 2001లో బీఆర్‌ఎస్‌ను స్థాపించిన అనంతరం జరిగిన ఉప ఎన్నికల్లో సిద్దిపేట నుంచి 58,712 ఓట్ల మెజార్టీతో కేసీఆర్ గెలుపొందారు. మొత్తం మీద 7 సార్లు ఎమ్మెల్యేగా, మెదక్, కరీంనగర్, మహబూబ్‌నగర్ స్థానాల నుంచి 5 సార్లు ఎంపీగా లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించారు. సిద్దిపేట నుంచి ఏడుసార్లు పోటీ చేసి ఆరుసార్లు గెలుపొందారు.

**2014 ఎన్నికల్లో**

- బీఆర్‌ఎస్ అభ్యర్థి కేసీఆర్‌కి వచ్చిన ఓట్లు -86,694
- టీడీపీ అభ్యర్థి వంటేరు ప్రతాప్‌రెడ్డికి వచ్చిన ఓట్లు- 67,303
- కాంగ్రెస్ అభ్యర్థి తూంకుంట నర్సారెడ్డికి వచ్చిన ఓట్లు -34,085
- ☛ ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి కేసీఆర్ 19,391 ఓట్ల మెజార్టీతో విజయం

**2018 ఎన్నికల్లో**

- బీఆర్‌ఎస్ అభ్యర్థి కేసీఆర్‌కి వచ్చిన ఓట్లు -1,25,444 ఓట్లు (60 శాతం)
- కాంగ్రెస్ అభ్యర్థి వంటేరు ప్రతాప్‌రెడ్డికి వచ్చిన ఓట్లు-67,154 ఓట్లు (32 శాతం)
- ☛ ఈ ఎన్నికల్లో కేసీఆర్ 58,290 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు.